సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

సోమవారం : 28 : ఏప్రిల్ : 2025



దగాపడిన అన్నదాత

రైతు సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేయడంతో అన్నదాతల పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోంది. 8లో



ఆర్డీటీని కాపాడుకుందాం

ఆర్డీటీని కాపాడుకుందామనే డిమాండ్‌పై అనంతపురంలోని పెన్షనర్స్ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
40.1°/22.9°

జిల్లా అంతటా ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం అధికంగా కొనసాగుతోంది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రశాంతి నిలయం: జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సాగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి ప్రభుత్వ అధికారులందరూ పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజలు తమ ఫిర్యాదులను అర్జీల ద్వారా తెలియజేయవచ్చని సూచించారు.

ఎస్పీ కార్యాలయంలోనూ..

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నట్లు ఎస్పీ వి. రత్న ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ ఆధార్‌కార్డును తప్పనిసరిగా వెంట తీసుకొని రావాలన్నారు. ప్రజలు వివిధ సమస్యలపై నేరుగా ఫిర్యాదు చేయొచ్చని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

75 చెట్లు నరికివేత

నల్లమాడ: మండలంలోని గూడమేకలపల్లికి చెందిన దేరంగుల నారాయణ అనే రైతుకు చెందిన 75 మామిడి, నేరేడు చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికి వేశారు. ఈ మేరకు ఆదివారం బాధిత రైతు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అందజేశాడు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. గూడమేకలపల్లికి దూరంగా ఉండే తన భూమిలో ఐదేళ్ల క్రితం మామిడి, నేరేడు చెట్లు సాగుచేశానని నారాయణ తెలిపారు. చెట్లు నరికివేసినట్లు గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకొని ఆదివారం ఉదయం పొలానికి వెళ్లానన్నారు. చెట్లన్నీ నేలకొరిగి ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

హ్యాండ్‌బాల్ చాంపియన్ 'కర్నూలు'



విజేతజట్టుకు ట్రోఫీని అందజేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజులుగా జరిగిన 54వ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో కర్నూలు జట్టు చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. మొత్తం 16 జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ఆదివారం టోర్నీ ముగిసింది. ప్రథమ స్థానం కర్నూలు జట్టు, ద్వితీయ స్థానం పశ్చిమ గోదావరి జట్టు, తృతీయ స్థానంలో శ్రీసత్యసాయి జిల్లా జట్టు నిలిచాయి. విజేత జట్టుకు సీనియర్ హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు ప్రసాద్ ట్రోఫీని ప్రదానం చేశారు. కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి మహేష్‌తో పాటు పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

వీడియో వైరల్ కేసులో నిందితుడికి రిమాండ్

- మరో నలుగురిపై కేసు నమోదు



పరిగి: మతపరమైన అంశంలో అనుచిత వ్యాఖ్యలు చేస్తూ సామాజిక మాధ్యమాల్లో వీడియో పోస్ట్ చేసిన పరిగికి చెందిన ఓ యువకుడిని అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రంగడు యాదవ్ తెలిపారు. తెలంగాణకు చెందిన ఓ యువతి కొన్ని రోజుల క్రితం సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేసిన వీడియోపై సదరు యువకుడు మతపరమైన దూషణకు పాల్పడడమే కాకుండా యువతిని అసభ్య పదజాలంతో దూషించడాన్ని నిరసిస్తూ శనివారం పరిగిలో ఉద్రిక్తత నెలకొంది. దీనిపై పోలీసులు సకాలంలో స్పందించి ఈ అంశం వివాదం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ క్రమంలో వీడియో వైరల్ చేసిన యువకుడిని అదుపులోకి తీసుకుని, ఆదివారం కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. అలాగే రెచ్చగొట్టేలా వీడియోను రూపొందించి వైరల్ చేసిన మరో నలుగురిపై కేసులు నమోదు చేశారు.

అక్రమాలు కోకొల్లలు

స్థానికుడు కాకపోయినా వందల ఎకరాలు కొనుగోలు చేశాడాయన. బినామీ పేర్లతో దందాలకు తెరలేపాడు. ఎవరైనా ప్రశ్నిస్తే కోర్టులను అడ్డం పెట్టుకుంటాడు. తాజాగా రియల్టర్ రెడ్డెప్పశెట్టి సబ్సిడీల దందా బయటకు వచ్చింది. బంధువులు, బినామీల పేర్లతో పాలీహౌస్, ఫారంపాండ్లలో రూ.కోట్ల అక్రమాలు చేసినట్లు స్పష్టమవుతోంది. కిందిస్థాయి ఉద్యోగులు పక్కాగా నివేదికలు ఇచ్చినా ఉన్నతాధికారులు మాత్రం చర్యలు చేపట్టకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



రెడ్డెప్పశెట్టి ఎస్టేట్‌లో నిర్మించిన సబ్సిడీ ఫారంపాండ్లు, పాలీహౌస్‌లు

- పాలీహౌస్, ఫారంపాండ్లలో రూ.కోట్ల అక్రమాలు
- సర్వేనంబర్లు మార్చి భారీగా సబ్సిడీలు
- బంధులు, బినామీల పేర్లతో రియల్టర్ దందా
- అధికారులకు మామూళ్లిచ్చి పనులు ?
- ఆధారాలు పక్కాగా ఉన్నా చర్యలకూ వెనకాడుతున్న వైనం



పాలీహౌస్‌లు, ఫారం పాండ్లకు రెడ్డెప్పశెట్టి, ఆయన బంధువులు, బినామీ పేర్లతో పొందిన సబ్సిడీ రికార్డు ప్రతి

చిలమత్తూరు: రియల్టర్ రెడ్డెప్పశెట్టి ప్రభుత్వాన్ని మోసం చేసి పాలీహౌస్‌లు, ఫారంపాండ్ల నిర్మాణాల్లో అక్రమాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. రెడ్డెప్పశెట్టి, ఆయన బంధువులు, బినామీల పేర్లతో సుమారు రూ.5 కోట్లకు పైగా లబ్ధి పొందినట్లు సమాచారం. పాలీహౌస్‌లకు ఒక ఎకరాకు మాత్రమే సబ్సిడీ పొందేందుకు అవకాశం ఉండగా, 2017-18, 2018-19 మధ్యన హార్టికల్చర్‌శాఖ నుంచి భారీగా నిధులు పొందారంటున్నారు. సుమారు రూ. 5.48 కోట్లు ఆయనకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభుత్వ నుంచి సబ్సిడీ సొమ్ము అందినట్లు రికార్డుల ద్వారా తెలుస్తోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆయన చేసిన ఈ దందాకుగాను అధికారులకు భారీగానే ముడుపులు ఇచ్చినట్లు స్పష్టంగా అర్థం అవుతోంది.

సబ్సిడీలు పొందిందిలా..

రియల్టర్ రెడ్డెప్పశెట్టి అధికారులను, ప్రజా ప్రతినిధులను అడ్డం పెట్టుకొని కోట్లాది రూపాయలు ప్రభుత్వం నుంచి సబ్సిడీల రూపంలో పొందారు. రైతులను మోసం చేసి డ్రిప్ పరికరాలు అప్పనంగా దోచేశారు. ఈ విషయంలో ఆయనపై కేసు కూడా నమోదైంది. అయినా సరే కోర్టులను తప్పుదోవ పట్టించే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అంతటితో ఆగకుండా పాలీహౌస్‌లు, ఫారంపాండ్లకు తన బంధువులు, బినామీల పేరుతో ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించి కోట్ల రూపాయల బిల్లులు పొందారు. రెడ్డెప్పశెట్టికి నారేముద్దేపల్లి రెవెన్యూ గ్రామంలో సర్వే నంబర్ 7-2 లో భూమి ఉంది. అయితే ఆయన పాలీహౌస్‌ల కోసం ఆ సర్వే నెంబరు చూపించి వేరొక రెవెన్యూ గ్రామంలో పాలీహౌస్‌లకు సబ్సిడీ పొందారు. చిలమత్తూరు, మొరసలపల్లి పంచాయతీల్లో భూమి ఉన్నట్లు రెవెన్యూ అధికారుల సహకారంతో హార్టికల్చర్ ద్వారా లబ్ధి పొందారు.

హబ్ భూములకూ ..

జి. వెంకటేశులు సన్నకారు రైతుగా చూపించి కోడూరు రెవెన్యూ గ్రామంలో సర్వే నంబరు 16-2బీలో భూమి ఉన్నట్లు చూపారు. బి.సుధాకర్‌రాజు అనే వ్యక్తి పేరిట 16-2ఎలో భూమి ఉన్నట్లు చూపి పాలీహౌస్‌లకు రూ. 40 లక్షలకు పైగా సబ్సిడీ పొందారు. అయితే వీరు చూపిన సర్వే నంబర్లు ఈడీ అటాచ్‌మెంట్‌లో ఉన్న లేపాక్షి నాలెడ్జి హబ్‌కు సంబంధించిన భూములు కావడం కలకలం రేపుతోంది. ఈ విషయంపై సుధాకర్‌రాజును 'సాక్షి' ఫోన్ ద్వారా సంప్రదిస్తే ఈ విషయంలో తమకేమీ సంబంధం లేదన్నారు. రెడ్డెప్పశెట్టి చెబితేనే చేశానని సమాధానం ఇవ్వడం గమనార్హం. ఆయన తమ పేరిట లీజు డాక్యుమెంట్లు సృష్టించి సబ్సిడీలు పొందారన్నారు. అయితే ఇవే సర్వే నంబర్లతో ఉన్న భూమి కొడికొండ పరిధిలో రెడ్డెప్పశెట్టి పేరిట ఉండటం గమనార్హం.

సోదరుడి పేరుతోనూ...

రెడ్డెప్పశెట్టి సోదరుడు పి.రవికుమార్ పేరుతో కూడా కోడూరు పొలంలోని సర్వే నంబరు 676 లో భూమి ఉంటే చిలమత్తూరు పొలంలో భూమి ఉన్నట్లు సృష్టించి రూ. 16.88 లక్షలు సబ్సిడీ పొందారు. అయితే 676 చిలమత్తూరు పొలంలో చూస్తే చెరువుగా ఉంది. ఇలా రెడ్డెప్పశెట్టి ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించి రూ.5.48 కోట్లు సబ్సిడీ రూపంలో పొందినట్లు స్పష్టంగా తెలుస్తోంది. వేర్వేరు సర్వే నంబర్లు ప్రభుత్వానికి చూపి ఒకేచోట అదీ రెడ్డెప్పశెట్టి భూమిలో నిర్మాణాలు చేపట్టడం గమనార్హం. కొడికొండలోని ప్రభుత్వ భూమిలో ఫారంపాండ్ నిర్మించినట్లు అధికారులు గుర్తించారు.


Adangal

సర్వే నెం : 16-2 | పూర్తి విస్తీర్ణం : 3.62
సాగుకు పనికి రాని విస్తీర్ణం : 3.62
సాగుకు పనికి వచ్చు విస్తీర్ణం : 0.0
భూమి స్వభావం : ప్ర.భూమి
శిస్తు (రూ.) : 2.4 | భూమి వివరణ : మెట్ట
జల ధారము : వర్షం | ఆయకట్టు విస్తీర్ణం : 0.0
ఖాతా నెంబరు : 123455
అనుభవదారుని విస్తీర్ణం (ఎకరాలు-సెంట్లు) : 3.62
పట్టాదారు పేరు (తండ్రి/భర్త పేరు) : లేపాక్షి నాలెడ్జ్ హబ్ (లేపాక్షి నాలెడ్జ్ హబ్)
అనుభవదారుని పేరు (తండ్రి/భర్త పేరు) : లేపాక్షి నాలెడ్జ్ హబ్ (లేపాక్షి నాలెడ్జ్ హబ్)
అనుభవ స్వభావం : కొనుగోలు
రిమార్కులు :

సుధాకర్‌రాజు పేరిట తీసుకున్న పాలీహౌస్ సబ్సిడీ పొందిన భూమి లేపాక్షి నాలెడ్జి హబ్ కింద చూపెడుతున్న అడంగల్

అధికారులకు అన్నీ తెలిసినా..

ఏదైనా ఒక సబ్సిడీ ఇవ్వాలంటే సామాన్య రైతుల విషయంలో అధికారులు సవాలక్ష నిబంధనలు అమలు చేస్తుంటారు. అయితే ప్రభుత్వాన్ని, రైతులను, ప్రజలను మోసం చేస్తున్న రెడ్డప్పశెట్టి లాంటి వారికి మాత్రం రూ.కోట్లు లబ్ధిచేకూర్చడం వెనుక భారీ ముడుపులు కథ ఉందన్న విమర్శలున్నాయి. రెడ్డప్పశెట్టి చేస్తున్న మోసం అధికారులకు తెలిసినా ఆర్థిక ఒప్పందాల కారణంగానే వాటిని బయటకు రాకుండా చేశారని అంటున్నారు.

1బీ మేరకే సబ్సిడీ

హార్టికల్చర్ సబ్సిడీలో పాలీహౌస్‌లు, ఫారం పాండ్లు ఉంటాయి. అయితే ఒక్కో రైతుకు ఒక ఎకరాకు మాత్రమే సబ్సిడీ ఇస్తాం. రెడ్డెప్పశెట్టి అనే వ్యక్తి వేర్వేరు పేర్లతో సబ్సిడీ పొందారన్న విషయం మాకు తెలీదు. రెవెన్యూ అధికారులు ఇచ్చిన వన్‌బీల ఆధారంగానే నిధులు మంజూరు చేశాం.

– రాజశేఖర్, డీహెచ్ఓ, శ్రీ సత్యసాయి జిల్లా

అనారోగ్యానికి 'పరోట'

- జోరుగా రెడీమెడ్ పరోటాల వాడకం
- రెండు, మూడు రోజులు నిల్వచేసి వేడి చేసి ఇస్తున్న హోటళ్ల నిర్వాహకులు
- నిద్రమత్తులో అధికారులు

▶ పుట్టపర్తి శివారున శ్రీసత్యసాయి సూపర్ స్పెషాలిటీ మెయిన్ గేటు ఎదురుగా నిర్వహిస్తోన్న ఓ హోటల్‌లో రెండు – మూడు రోజుల పాటు నిల్వ ఉంచిన రెడీమేడ్ పరోటాలు సరఫరా చేస్తున్నారు. ఇటీవల దుర్వాసన వస్తోన్న పరోటాలను గమనించి.. ఓ వినియోగదారుడు ప్రశ్నించాడు. దీనిపై హోటల్ నిర్వాహకులు స్పందించి.. రెండు – మూడు రోజుల పాటు నిల్వ చేసినవి కావడంతో వాసన వస్తోన్నట్లు సమాధానం ఇవ్వడంతో వినియోగదారుడు అవాక్కయాడు. వెంటనే అతను ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

▶ హిందూపురం పట్టణం రైల్వేస్టేషన్ సమీపంలోని అండర్‌పాస్ వద్ద ఉన్న ఓ చిన్న హోటల్‌లో పరోటా, కుష్కా ప్రసిద్ధి. డిమాండ్‌కు అనుగుణంగా రెడీమేడ్ పరోటాలు సరఫరా చేస్తుంటారు. ఒక్కోసారి కస్టమర్లు రాని సమయంలో రెండు, మూడు రోజుల పాటు ఫ్రిజ్‌లో ఉంచి తర్వాత ఇస్తున్నారు. వారం రోజుల క్రితం ఓ వ్యక్తి పరోట దుర్వాసన వస్తున్నట్లు నిర్వాహకులను నిలదీశారు. వెంటనే రుచి చూసి పక్కన పడేశాడు. సదరు వినియోగదారుడు ఫుడ్‌సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నాడు.



సాక్షి, పుట్టపర్తి: ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల జీవన శైలిలో అనేక మార్పులు వచ్చాయి. ఆహారపు అలవాట్లు చాలా వరకూ మారిపోయాయి. ఇంటి భోజనం కంటే హోటళ్లు, ధాబాలు, రెస్టారెంట్లు, బేకరీ ఫుడ్‌కు చాలా మంది ప్రాధాన్యం ఇస్తున్నారు. డిమాండ్‌కు అనుగుణంగా హోటల్ నిర్వాహకులు.. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. నిల్వ ఉన్న పదార్థాలు, పలు రసాయనాలతో చేసిన వంటకాలతో ప్రజలను అనారోగ్యం బారిన నెడుతున్నారు. క్యాన్సర్ రోగుల్లో 53 శాతం మంది కల్తీ ఆహారంతోనే సమస్య తెచ్చుకున్నారని పలు సర్వేలు వెల్లడించడం ప్రమాద తీవ్రతను తెలియజేస్తోంది. ఇటీవల ఏ హోటల్‌లో చూసినా రెడీమేడ్ పరోటాలు కలకలం రేపుతున్నాయి. ఒక రోజు తయారీ చేసి.. మరుసటి రోజు సరఫరా అయి.. ఆ తర్వాతి రోజు వినియోగదారులకు వడ్డిస్తున్నారు. ధర్మవరం, పుట్టపర్తి, హిందూపురం పట్టణాల్లో ఎక్కువగా రెడీమేడ్ పరోటాల వ్యాపారం సాగుతోంది.

నిబంధనలు బేఖాతరు..

జిల్లాలో చిన్నా, పెద్ద హోటల్స్, రెస్టారెంట్స్, ధాబాలు, చాట్, నూడుల్ షాపులు అన్ని కలిపి 5 వేలకు పైగా ఉంటాయి. వీటి ద్వారా ప్రతి ఏటా కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతోంది. వాస్తవానికి హోటళ్లు ఆహార పరిరక్షణ, నాణ్యత ప్రమాణాల సంస్థ నుంచి లైసెన్స్ తీసుకోవాల్సి ఉంది. కానీ జిల్లాలో ఇలా అనుమతి తీసుకుని వ్యాపారం చేసే సంస్థలు 25 శాతానికి మించి ఉండవనేది బహిరంగ రహస్యం. పెద్ద హోటళ్లు, రెస్టారెంట్లు మినహా అధిక శాతం హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, రోడ్డుపైడు హోటళ్లలో పరిశుభ్రత గురించి పట్టించుకోవడం లేదు. ఆ శాఖ పరిధిలో జిల్లా స్థాయి అధికారితో పాటు ఓ గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్, మరో ఇద్దరు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఉంటారు. నెలకు 12 శాంపిల్స్ సేకరించాలి. వాటిని ప్రయోగశాలకు పంపి, పరిశీలన తర్వాత కేసులు నమోదు చేయాల్సి ఉంది. కల్తీని బట్టి క్రిమినల్ లేదా సివిల్ కేసులు నమోదు చేసి జరిమానాలు విధించే వీలుంది. కానీ ఇవి సక్రమంగా జరగడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

తనిఖీలు చేస్తున్నాం

జిల్లాలో ఏడాదికి 360 శ్యాంపిల్స్ తీసి ల్యాబ్‌కు పంపించాల్సి ఉంది. ఈ మేరకు జిల్లాలో నెలకు 12 శాంపిల్స్ తీసి ల్యాబ్‌కు పంపిస్తున్నాం. కల్తీ తేలిన చోట కేసులు కూడా నమోదు చేస్తున్నాం. ఆహారంలో కల్తీ జరిగిందని తెలిస్తే ఎవరైనా ఫిర్యాదు చేస్తే అక్కడకు వెళ్లి శాంపిల్స్ సేకరిస్తున్నాం. ఆహారం కల్తీ జరగకుండా అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నాం.

– రామచంద్ర, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, పుట్టపర్తి

ఫలితం లేని 'పరీక్ష'

- డిగ్రీ పరీక్షలు నిర్వహించి ఐదు నెలలు పూర్తి
- నేటికీ ఫలితాలు ప్రకటించని వైనం



ఎస్కేయూ ప్రధాన ద్వారం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. పరీక్షలు ఎప్పుడు నిర్వహిస్తారో తెలియదు. రాసిన పరీక్షలకు ఫలితాలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి. వర్సిటీ పరీక్షల విభాగం అస్తవ్యస్తంగా మారడమే ఇందుకు నిదర్శనం. ఫలితాలు సకాలంలో విడుదల చేయకపోవడంతో పీజీ కోర్సులకు వెళ్లలేని పరిస్థితి. మరో వైపు ఉద్యోగం వచ్చిన విద్యార్థులు సైతం ఫలితాలు రాకపోవడంతో నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

15 వేల మంది నిరీక్షణ..

ఎస్కేయూ పరిధిలో డిగ్రీ మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్, మెగా సప్లిమెంటరీ పరీక్షలు గతేడాది నవంబర్‌లో జరిగాయి. వీటితో పాటు ఐదో సెమిస్టర్ పరీక్షలు కూడా నిర్వహించారు. 2014 నుంచి 2024 వరకు డిగ్రీ, బీఈడీ, పీజీ చదివి ఫెయిల్ అయిన విద్యార్థులకు స్పెషల్ మెగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించారు. ఏడాది పరీక్షల విధానంలో పరీక్షలు రాసి ఫెయిల్ అయిన విద్యార్థులకు సైతం మెగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించారు. 1994 నుంచి ఫెయిల్ అయిన వారికి అవకాశం కల్పించారు. అయితే ఇప్పటి దాకా ఫలితాలు మాత్రం రాలేదు. ఫలితాలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి. మొత్తం 18 వేల మంది విద్యార్థులు ఫలితాల కోసం నిరీక్షిస్తున్నారు. వాస్తవానికి పరీక్షలు పూర్తయిన నెల రోజుల్లో ఫలితాలు ప్రకటించాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా ప్రయత్నాలు చేయలేదు. పరీక్షల విభాగం ఉన్నతాధికారుల అనుమతి లేకుండానే ఇక్కడ బాగా పనిచేసే సిబ్బందిని ఇతర విభాగాలకు బదిలీ చేయడంతో సమస్య వచ్చిందంటున్నారు.

ఫలితాల విడుదలకు కృషి చేస్తాం


ఫలితాల విడుదలలో జాప్యం జరిగింది వాస్తవమే. బాగా పనిచేస్తున్న వారిని బదిలీ చేయకుండా ఉండాల్సింది. కనీసం సంబంధిత విభాగాధిపతుల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. ఫలితాల విడుదలకు కృషి చేస్తాం.

– జీవీ రమణ, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్, ఎస్కేయూ

మళ్లీ చిరుతల సంచారం

- గుడిబండ వాసుల ఆందోళన

గుడిబండ: మండల కేంద్రంలో చిరుతల సంచారం మరోసారి కలకలం రేపుతోంది. ఆదివారం ఉదయం గ్రామానికి సమీపంలోని కొండపై చిరుతలు గుంపులుగా సంచరిస్తున్నట్లు ప్రజలు గుర్తించారు. చాలా కాలంగా కొండపై ఉన్న పొదల్లో చిరుతలు తిష్ట వేసి ఉన్నాయంటున్నారు. రాత్రి పూట నివాసాల వద్దకు వచ్చి పశువులు, మేకలు, గొర్రెలపై దాడి చేస్తున్నట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు పొలాల వద్దకు వెళ్లేందుకు భయపడుతున్నారు. అటవీశాఖ అధికారులకు చాలా రోజుల నుంచి ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదని చెబుతున్నారు. కనీసం ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కొండపై సంచరిస్తున్న చిరుత



నృత్యం చేస్తున్న చిన్నారులు



బాలుర ప్రదర్శన



సాయి గాయత్రి మంత్ర పఠనం చేస్తున్న భక్తులు

సాయి నామమే మధురం..

ప్రశాంతి నిలయం: పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తి ప్రశాంతి నిలయానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్రంలోని నాగర్‌కర్నూల్ జిల్లా సత్యసాయి భక్తులు సత్యసాయి మహాసమాధి చెంత నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఆదివారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో బాలవికాస్, సత్యసాయియూత్ బృందం నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం సత్యసాయిని కీర్తిస్తూ సంగీత కచేరీ నిర్వహించారు.

క్లుప్తంగా

పీఏబీఆర్‌లో తగ్గిన నీటిమట్టం



రిజర్వాయర్‌లో నిల్వ ఉన్న నీరు

కూడేరు: ఇన్‌ఫ్లో లేక కూడేరు మండలం పెన్న హోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్)లో నీటి మట్టం తగ్గింది. ఆదివారం నాటికి రిజర్వాయర్‌లో 2.62 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డ్యాం ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు. జలాశయం వద్ద ఏర్పాటైన అనంతపురం, శ్రీసత్యసాయి, ఉరవకొండ తాగునీటి ప్రాజెక్ట్‌లకు రోజుకు సుమారు 40 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. లీకేజీ, ఆవిరి రూపంలో సుమారు 60 క్యూసెక్కుల వరకు నీరు బయటకు వెళుతోంది.

వృద్ధుడి బలవన్మరణం

సోమందేపల్లి: జీవితంపై విరక్తితో ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... సోమందేపల్లి మండలం మాగేచెరువు గ్రామానికి చెందిన రామప్ప (68)కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు వెంకటేష్ ఇంట్లోనే నివాసముంటున్న ఆయన శనివారం రాత్రి అందరితో కలసి భోజనం ముగించుకుని నిద్ర పోయాడు. ఆదివారం తెల్లవారుజామున కుటుంబసభ్యులు నిద్రలేచి చూసేసరికి ఓ గదిలో పైకప్పునకు ఉరి వేసుకుని విగతజీవిగా వేలాడుతూ రామప్ప కనిపించాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రమేష్‌బాబు ఆ గ్రామానికి చేరుకుని పరిశీలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కాగా, రామప్ప ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

అడిగిన ప్రతి రైతుకూ డ్రిప్, స్ప్రింక్లర్లు అందిస్తామని ఘనంగా ప్రకటించిన చంద్రబాబు సర్కారు జిల్లాకు 41,200 హెక్టార్ల టార్గెట్ ఇచ్చి. చివరకు 17 వేల హెక్టార్లకు మాత్రమే పరిమితమైంది. వ్యవసాయ, ఉద్యాన, పట్టుపరిశ్రమ, పాడి పరిశ్రమ, మత్స్యశాఖ పరిధిలో పథకాలకు సంబంధించి బడ్జెట్ తగ్గించేశారు. అమూల్ పాలవెల్లువను బలవంతంగా ఆపి పాడి రైతుల పొట్ట కొట్టారు. పశుబీమాను అటకెక్కించారు. ప్రతిష్టాత్మక ఆర్‌బీకే వ్యవస్థ ద్వారా రైతులకు సేవలు అందకుండా నిర్వీర్యం చేశారు. నియోజకవర్గ స్థాయి వ్యవసాయ, వెటర్నరీ ప్రయోగశాలలను నామమాత్రం చేశారు. మారుమూల ప్రాంతాల్లోని మూగజీవాలకు ప్రాణదానం చేస్తున్న 1962 వెటర్నరీ అంబులెన్స్‌లనూ ఆపేశారు. రైతు సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేయడంతో అన్నదాతల పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోంది. –అనంతపురం అగ్రికల్చర్

దగాపడిన అన్నదాత



- పైసా విదల్చని కూటమి ప్రభుత్వం
- సుఖీభవ లేదు, ఇన్‌పుట్, ఇన్సూరెన్స్‌కు గతి లేదు, ఎక్స్‌గ్రేషియా అసలే లేదు
- పంటలు దెబ్బతిన్నా ఖరీఫ్, రబీలో కంటితుడుపుగా కరువు మండలాల ప్రకటన
- ఆర్‌బీకేలు, అగ్రి-వెటర్నరీ ల్యాబ్‌లు నిర్వీర్యం, ఆగిన 1962 అంబులెన్స్ సేవలు

అన్నదాత సుఖీభవ కింద ఏటా ప్రతి రైతుకూ రూ.20 వేలు పెట్టుబడిసాయం అందిస్తామన్న హామీని కూటమి పెద్దలు తుంగలో తొక్కేశారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ కింద మూడు విడతల్లో రూ.6 వేలు రైతుల ఖాతాల్లోకి వేసింది. చంద్రబాబు చెప్పినట్లు సుఖీభవ పథకం కింద ఈ ఏడాది రూ.20 వేలు ఇచ్చివుంటే 2.90 లక్షల మంది వరకు రైతులకు రూ.580 కోట్లు జమ అయ్యేవి. పోనీ, పీఎం కిసాన్ రూ.6 వేలతో కలిపి రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.14 వేలు ఇచ్చివున్నా రూ.400 కోట్లపైచిలుకు ప్రయోజనం చేకూరేది. అయితే పైసా ఇవ్వకుండా ఈ ఏడాది మొండి చెయ్యి చూపించారు.

- గతంలో 2019–24 మధ్య వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏటా పీఎం కిసాన్, రైతు భరోసా కింద రూ.13,500 చొప్పున ఐదేళ్లలో ఒక్కో రైతుకు రూ.67,500 చెల్లించింది. అలా ఐదేళ్లలో జిల్లా రైతులకు రూ.1,937 కోట్లు పెట్టుబడి సాయం అందింది.

దిక్కూమొక్కు లేని పంటల బీమా

2023 ఖరీఫ్, రబీకి సంబంధించి ఉచిత పంటల బీమా పథకం కింద ఇవ్వాల్సిన పరిహారంతో తమకు సంబంధం లేదన్నట్లుగా సీఎం చంద్రబాబు వ్యవహరిస్తున్నారు. 2024 ఖరీఫ్‌లో ఉచిత పంటల బీమా అమలు చేసినా... పరిహారం చెల్లింపు అనుమానంగానే కనిపిస్తోంది. ఉచిత పంటల బీమా పథకానికి మంగళం పాడేసి రబీ నుంచి రైతుల నుంచి ప్రీమియం కట్టించుకోవడం మొదలు పెట్టారు. ఇలా ఇకపై ఏటా రూ.100 కోట్ల వరకు ప్రీమియం రూపంలో రైతులపై అదనపు భారం మోపారు.

- 2019–24 మధ్య వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులపై ప్రీమియం భారం పడకుండా ఉచిత పంటల బీమా కింద ఏకంగా జిల్లా రైతులకు రూ.1,967 కోట్ల భారీ మొత్తంలో పరిహారం చెల్లించింది. తొలిసారిగా ఉద్యాన రైతులకు బీమా ఇచ్చి భరోసా కల్పించింది. ఇక ప్రీమియం రూపంలో ఏటా రూ.100 కోట్ల వరకు జిల్లా రైతులకు ఆదా అయ్యేలా చర్యలు తీసుకుంది.

స్పష్టత లేని సున్నా వడ్డీ

ఖరీఫ్, రబీ కింద బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్న రైతులకు వడ్డీ రాయితీపై చంద్రబాబు ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదు.

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఖరీఫ్, రబీ కింద బ్యాంకుల్లో రూ.లక్ష లోపు పంట రుణాలు తీసుకున్న చిన్న, సన్నకారు రైతులకు సున్నావడ్డీ కింద రూ.72 కోట్ల వరకు వడ్డీ మాఫీ చేయడంతో 3.40 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరింది.

మద్దతు ధర హుష్‌కాకి

ఖరీఫ్, రబీ పంట ఉత్పత్తులు అరకొరగానే చేతి కొచ్చాయి. గిట్టుబాటు ధర లేకపోవడంతో బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు, దళారులకు తక్కువ ధరకే అమ్ముకుంటున్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించింది.

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.350 కోట్ల విలువైన వ్యవసాయ ఉత్పత్తులను మద్దతు ధరతో కొనుగోలు చేసింది.

విత్తనంపై రాయితీ తగ్గింపు

కరువు పరిస్థితులు నెలకొన్నా ఈ రబీలో కేవలం 25 శాతం సబ్సిడీతో విత్తన పప్పుశనగ అందించడంతో జిల్లా రైతులపై రూ.6 కోట్ల వరకు అదనపు భారం పడింది. ఇక ఖరీఫ్‌లో విత్తన వేరుశనగ, కందులు నామమాత్రంగా అందించారు. 80 శాతం రాయితీతో ప్రత్యామ్నాయం అంటూ 27 వేల క్వింటాళ్లకు గానూ 10 వేల క్వింటాళ్లతో సరిపెట్టారు.

- గత జగన్ సర్కార్ 40 శాతం రాయితీతో రైతులకు విత్తనం అందించింది. ఐదేళ్ల జగన్ పాలనలో అన్ని రకాలకు చెందిన 6.70 లక్షల క్వింటాళ్ల విత్తనాలపై రైతులకు రూ.289 కోట్ల రాయితీ దక్కింది.

రైతు ఆత్మహత్య బాధితులకు మొండిచేయి

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఈ 10 నెలల వ్యవధిలోనే అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న దాదాపు 43 మంది రైతులకు సంబంధించి ఏ ఒక్కరికీ పరిహారం (ఎక్స్‌గ్రేషియా) అందలేదు. రెండు నెలల క్రితం ప్రభుత్వానికి పంపినా 20 మంది బాధిత రైతు కుటుంబాల జాబితా పత్తా లేకుండా పోయింది.

- గతంలో రైతు ఆత్మహత్య చేసుకున్న రెండు మూడు నెలల్లోపే బాధిత కుటుంబాలకు రూ.7 లక్షల మేర పరిహారాన్ని అప్పటి సీఎం వైఎస్ జగన్ అందజేశారు. ఇలా 280 మంది బాధిత రైతు కుటుంబాలకు రూ.17.40 కోట్ల ఎక్స్‌గ్రేషియాను అందించారు. ఇందులో 110 మంది బాధిత కుటుంబాల్లో రైతులు గతంలో చంద్రబాబు పాలించిన 2014–19 మధ్య కాలంలో ఆత్మహత్య చేసుకున్న వారు కావడం గమనార్హం.

కంటి తుడుపుగా కరువు మండలాలు

2023 రబీలో వర్షాభావ పరిస్థితుల కారణంగా ప్రధాన పప్పుశనగ పంటతో పాటు మిగిలిన పంటలూ దెబ్బతిన్నాయి. అప్పటి ప్రభుత్వం 17 మండలాలను కరవు జాబితాలో ప్రకటించింది. ఈ క్రమంలో చంద్రబాబు ప్రభుత్వం కొలువుతీరిన తర్వాత ఆగస్టులో కేంద్ర కరువు బృందం వచ్చివెళ్లింది. నిబంధనల మేరకు రూ.36 కోట్ల మేర పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ) చెల్లింపు జాడ లేకుండా పోయింది. అలాగే ఈ ఖరీఫ్‌లో కరువు జాబితాలో కేవలం ఏడు మండలాలనే ప్రకటించి... కేంద్ర బృందాన్ని రప్పించి రూ.19 కోట్లు ఇన్‌పుట్ ఇస్తామన్నారు. దానికి కూడా మోక్షం లేదు. ప్రస్తుత రబీలో కూడా కేవలం ఏడు మండలాలను కరువు జాబితాలోకి చేర్చి చేతులు దులుపుకున్నారు. ఇక ప్రకృతి వైపరీత్యాలతో దెబ్బతిన్న వ్యవసాయ, ఉద్యాన పంటలకు ఇప్పటి వరకూ ఇన్‌పుట్‌సబ్సిడీ ఇవ్వలేదు. ఈ నెల రోజుల వ్యవధిలోనే వ్యవసాయ, ఉద్యాన పంటలకు రూ.50 కోట్లకు పైగా నష్టం వాటిల్లింది.

- గత వైఎస్ జగన్ సర్కార్ ఏ సీజన్‌లో జరిగిన నష్టానికి అదే సీజన్ ముగిసేలోపు ఇన్‌పుట్ పరిహారం చెల్లించి ఆదుకుంది. ఇలా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో జిల్లా రైతులకు రూ.377 కోట్ల మేర ఇన్‌పుట్ సబ్సిడీ జమ అయింది.

చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి



ఖలీల్ (ఫైల్)

చిలమత్తూరు: ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి కింద పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... చిలమత్తూరు గ్రామానికి చెందిన ఖలీల్ (40)కు భార్య, ఓ కుమారుడు ఉన్నారు. పెయింటింగ్ పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో గత శుక్రవారం పనికి వెళ్లిన ఆయన చింత చిగురు కోసమని చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు అదుపు తప్పి కిందపడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అటుగా ఎవరూ వెళ్లకపోవడంతో ఈ విషయం వెలుగు చూడలేదు. ఆదివారం ఉదయం అటుగా వెళ్లిన వారు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఎండ తీవ్రతకు మృతదేహం బొబ్బలెక్కి ఉబ్బిపోయింది. దుర్వాసన వెదజల్లుతోంది. మృతదేహం వద్ద లభ్యమైన ఆధారాలను బట్టి మృతుడిని ఖలీల్‌గా నిర్ధారించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం



బత్తలపల్లిలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు

బత్తలపల్లి: స్థానిక ఎస్‌కేజీఎం కళాశాలలో 2008–2010లో ఇంటర్ విద్యను అభ్యసించిన వారు బత్తలపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్ వేదికగా ఆదివారం కలుసుకున్నారు. అప్పట్లో కలసి చదువుకున్న 130 మందిలో 90 మంది హాజరయ్యారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సందడి చేశారు. నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులను సన్మానించారు. 2008లో అప్పటి కళాశాల కరస్పాండెంట్ కమతం ఈశ్వరయ్య, ప్రిన్సిపాల్ జ్వాలారెడ్డి, అధ్యాపకులు పాపన్న, సూర్యనారాయణ, వన్నూరుసాహెబ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



తలుపుల పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

తలుపుల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1981–1986 విద్యాసంవత్సరాల్లో 6 నుంచి 10వ తరగతి వరకూ చదువుకున్న వారు అదే పాఠశాల వేదికగా ఆదివారం కలుసుకుని సందడి చేశారు. నాటి గురువులు సేతురామశర్మ, మహబూబ్ బేగ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు అయూబ్‌ఖాన్, గిరిధర్ శర్మ, మహమ్మద్ రఫీ, రఘునాథరెడ్డి, ధనలక్ష్మి, సుదారాణి నేతృత్వం వహించారు.



తాడిమర్రిలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

తాడిమర్రి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆపూర్వ సమ్మేళనం ఘనంగా జరిగింది. 1995 నుంచి 2000 వరకూ ఆ పాఠశాలలో చదివిన విద్యార్థులందరూ పాల్గొన్నారు. బాల్యంలో విడిపోయిన వారందరూ 25 ఏళ్ల తర్వాత ఉపాధ్యాయులుగా, పోలీసులుగా, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా, వ్యాపారులుగా స్థిరపడిన తర్వాత కలుసుకుని సందడి చేశారు. నాటి చిలిపి పనులు గుర్తు చేసుకుని మురిసిపోయారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులు విజయకుమార్, శ్రీనివాసులు, దేవకీదేవి, ఓబులేసు, శ్రీధర్, చంద్రమౌళేశ్వరి గుప్త తదితరులతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణకు కాళ్లు కడిగి పూజలు చేశారు. శాలువాలు కప్పి సన్మానించారు.

'వెటర్నరీ' అసోసియేషన్ ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక



వెటర్నరీ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన జిల్లా కార్యవర్గ సభ్యులు

అనంతపురం అగ్రికల్చర్: పశుసంవర్ధకశాఖ అధికారుల సంఘం (వెటర్నరీ ఆఫీసర్స్ అసోసియేషన్) ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రామచంద్రారెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక పశుశాఖ డీడీ కార్యాలయంలో రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు పార్థసారథిరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాకు సంబంధించి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రెడ్డిపల్లి శిక్షణా కేంద్రం ఏడీ డాక్టర్ వి.రామచంద్రారెడ్డిని ఎన్నుకోగా, కార్యదర్శిగా డాక్టర్ పి.మల్లేష్‌గౌడ్ (కొత్తచెరువు వీహెచ్, ఏడీ), కోశాధికారిగా డాక్టర్ జీఎస్ అమర్ (మడకశిర వీహెచ్, ఏడీ), ఉపాధ్యక్షురాలిగా డాక్టర్ ప్రసన్నబాయి (తలుపుల వీహెచ్, ఏడీ), జాయింట్ సెక్రటరీగా డాక్టర్ ఖదీర్‌బాషా (తాడిపత్రి వీహెచ్, ఏడీ) ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు రెండు జిల్లాల జేడీలు డాక్టర్ జీపీ వెంకటస్వామి, డాక్టర్ జి.శుభదాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కార్యవర్గ సభ్యులను, అసోసియేషన్ సభ్యులను ఆ శాఖ అధికారులు అభినందించారు.

వృద్ధుడి అనుమానాస్పద మృతి



మృతుడు గోవిందప్ప

గుడిబండ: మండలంలోని నాచేపల్లి గ్రామానికి చెందిన గోవిందప్ప(60) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కొన్నేళ్లుగా మతిస్థిమితం లేక తిరిగేవాడు. భార్య భాగ్యమ్మ, కుమారులు, కుమార్తె బెంగళూరుకు వలస వెళ్లి కూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. శనివారం రాత్రి తన ఇంటి వద్ద బొక్కబోర్లా పడి కనిపించడంతో గమనించిన గ్రామస్తులు పైకి లేపేందుకు ప్రయత్నించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లుగా నిర్ధారించుకుని సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ గోవిందప్ప భార్య భాగ్యమ్మ చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యువకుడి దుర్మరణం

బుక్కరాయసముద్రం: మండలంలోని రేకులకుంట సమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. బీకేఎస్ మండలం దయ్యాలకుంటపల్లికి చెందిన చాకలి శివానంద (28) గ్రామంలో రజక వృత్తితో కుటుంబానికి చేదోడుగా నిలాచాడు. భార్య ప్రసన్నలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. వ్యక్తిగత పనిపై ఆదివారం అనంతపురానికి వెళ్లిన ఆయన.. రాత్రి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. రేకులకుంట సమీపంలోకి చేరుకోగానే వేగంగా దూసుకొచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఘటనలో శివానంద కాలు విరిగి 15 అడుగుల దూరంలో పడింది. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనం ఆపకుండా దూసుకెళ్లిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

ఆర్డీటీని కాపాడుకుందాం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్



సమావేశంలో మాట్లాడుతున్న వి.రాంభూపాల్

అనంతపురం టవర్‌క్లాక్: నిరుపేదల జీవనోపాధుల కోసం విశేష కృషి చేస్తున్న ఆర్డీటీకి నిధులు రాకుండా కేంద్రంలోని కూటమి ప్రభుత్వం అడ్డుకుంటోందని, ఇలాంటి తరుణంలో ఆర్డీటీని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్ పిలుపునిచ్చారు. ఆర్డీటీని కాపాడుకుందామనే డిమాండ్‌పై అనంతపురంలోని పెన్షనర్స్ భవన్‌లో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో రాంభూపాల్ మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత ఆర్డీటీకు విదేశీ నిధులు రాకుండా అడ్డుపడిందన్నారు. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి చూడలేదన్నారు. దీని వల్ల సంస్థ సేవలు నిలిచి పోయే పరిస్థితి వచ్చిందన్నారు. నిత్యం కరువు కాటకాలతో విలవిల్లాడుతున్న జిల్లాకు ఆర్డీటీ వరదాయినిగా నిలిచిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆర్డీటీకి నిధులు అందకపోతే నష్టపోయేది పేదలేనన్నారు. మతం పేరుతో బీజేపీ ఇలాంటి దురాగతాలకు పాల్పడడం తగదన్నారు. కులాలు, మతాలకు అతీతంగా సేవలు అందిస్తున్న సంస్థపై ఆంక్షలు సరికాదన్నారు. పేదలు ఐక్యతతో ఉద్యమాలు చేపట్టి ఆర్డీటీని కాపాడుకోవల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. ఈ పోరాటాలకు కుల, ప్రజాసంఘాలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సంస్థ అందజేస్తున్న ఉచిత విద్యతో ఎందరో ఇంజినీర్లు, డాక్టర్లుగా జీవితంలో స్థిరపడ్డారన్నారు. తక్షణమే కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరిపి ఆర్డీటీకి విదేశీ నిధులు అందేలా చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున పోరాటాలు సాగిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాలు, కుల సంఘాల నాయకులు గోవిందరాజులు, ఎస్.ఎం. బాషా, సాకే హరి, నెరమెట్ల ఎల్లన్న, ఓ.నల్లప్ప, కృష్ణమూర్తి, చంద్రశేఖర్ రెడ్డి, ఓబులేసు, రాహుల్, శివారెడ్డి, కేశవరెడ్డి, చంద్రశేఖర్, శ్రీనివాసులు, సాయికుమార్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ బంగ్లాలో అగ్ని ప్రమాదం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

పెనుకొండ రూరల్: స్థానిక సబ్ కలెక్టర్ బంగ్లాలో ఆదివారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. కొందరు ఆకతాయిలు బంగ్లా ఆవరణలోని ఎండు గడ్డికి నిప్పు రాజేయడంతో మంటలు చెలరేగాయి. బంగ్లా ఆవరణలోని పచ్చని మొక్కలు కాలిపోయాయి. అప్రమత్తమైన ఫైర్ సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేసింది.

స్టార్టర్లు, కేబుల్ అపహరణ



స్టార్టర్‌ను ఎత్తుకెళ్లిన దృశ్యం

హిందూపురం: మండలంలోని మలుగూరు సమీపంలోని తోటల్లో రైతులు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటారు స్టార్టర్లు, కేబుల్‌ను దుండగులు అపహరించారు. శనివారం రాత్రి వరుసగా ఐదుగురు రైతుల తోటల్లో ఈ ఘటనలు చోటు చేసుకున్నాయి. ఘటనపై బాధిత రైతులు పాతిరెడ్డి, మూర్తి, గోవిందు, నారాయణస్వామి తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు చేతికి వచ్చే సమయంలో నీటి తడులు ఇచ్చే అవకాశం లేకుండా చేశారంటూ వాపోయారు.

గోరంట్లలో చోరీ

గోరంట్ల: స్థానిక మక్కా మస్జిద్ వీధిలో నివాసముంటున్న నసీమున్నీసా ఇంట్లో చోరీ జరిగింది. బాధితురాలు తెలిపిన మేరకు... ఆదివారం మధ్యాహ్నం నసీమున్నీసా ఇంటికి ఆమెతో పరిచయమున్న ఓ మహిళ.. మరో ఇద్దరు మహిళలను వెంట పెట్టుకుని వెళ్లింది. ఆ సమయంలో వారు దుస్తులను మార్చుకోవాలని కోరడంతో బెడ్‌రూమ్‌లోకి నసీమున్నీసా అనుమతించారు. వారు వెళ్లిపోయిన తర్వాత బీరువా తెరిచి చూడగా 12 తులాల బంగారు నగలతో పాటు రూ.50 వేల నగదు కనిపించకపోవడంతో వెంటనే ఇంటికి వచ్చి వెళ్లిన తన పరిచయస్తురాలికి ఫోన్ చేసింది. ఆమె ఫోన్ స్విచ్ఛాఫ్ అని రావడంతో ఘటనపై ఫిర్యాదు చేయడంతో పోలీసులు అక్కడకు చేరుకుని ఆరా తీశారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఎకాలజీ సెంటర్‌లో ఉచిత శిక్షణ

అనంతపురం అగ్రికల్చర్: ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో నిరుద్యోగ యువతకు 45 రోజుల పాటు ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఈ మేరకు ఆ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మే ఒకటి నుంచి కొత్త బ్యాచ్ ప్రారంభం కానుంది. ఇంటర్ పాస్, డిప్లొమా, డిగ్రీ, ఇంజనీరింగ్ పాస్ లేదా ఫెయిల్ అయిన 20 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సున్న నిరుద్యోగ యువతీయువకులు అర్హులు. బేసిక్స్ కంప్యూటర్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీసు, బేసిక్ ట్యాలీ, లైఫ్ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్, బేసిక్ స్పోకెన్ ఇంగ్లిషు, కస్టమర్ రిలేషన్‌షిప్ స్కిల్స్ అంశాలపై శిక్షణ ఉంటుంది. శిక్షణా సమయంలో మధ్యాహ్నం భోజన వసతి ఉంటుంది. శిక్షణ ముగిసిన తర్వాత సర్టిఫికెట్‌తో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తారు. వివరాలకు 73969 50345లో సంప్రదించవచ్చు.